# మాపద్మ

మొక్కపాటి నరసింహశాస్త్రి

[If you have tears prepare to shed them now: Shakespeare]

౧

పద్మావతి నాకూతురు కాదు, నా బంధువుల పిల్లకూడా కాదు, నాస్నేహితుని కూతురు. నేను పెంచుకోనుకూడా లేదు, ఆపిల్లని. అయినా ఎప్పుడూ నేనూ, నాభార్యా కూడా దాన్ని మాపిల్ల అనే భావించుకున్నాము తప్ప పరాయిపిల్లని కలలోకూడా అనుకోలేదు. దాని తల్లితండ్రులుకూడా తమరు కన్నబిడ్డ అయినా, ఆపిల్ల మాదిఅయినట్లు, తమకే ఎరువుఅయినట్లు చూచుకునేవారు.

ఈభూమిమీద పడి మొదటసారి తన విశాలనేత్రములను తెరచి, పురిటింటి నాలుగు గోడలమధ్యనున్న నూత్నప్రపంచమును నాలుగుమూలలా తెలియనితనముతో పరకాయించి చూచి, నామీద దృష్టి నిలిపినప్పుడుమాత్రము చిన్నినవ్వు నవ్వినట్లు తోచింది నాకు. ఆ లోచనాంతరాళముల యందు లోకాంతరప్రతిబింబము లున్నట్లు తోచింది నాకు. ఆ చిన్నశరీరమునకు ఇతర ప్రపంచముల దివ్యసౌరభము లంటియున్నవి.

ఆస్పృష్టిసమయమందు, ప్రాణమునుండి ప్రాణిము బయలువెడలునప్పుడు, కొంచెమించుమించుగా నాస్తికుడనైన నేను, అవిశ్వాసముతో కూడుకొన్న పాశ్చాత్యవిద్యావరణముచే కన్నులుమూతవడిన నేనుకూడా భయపడ్డాను. సృష్ట్యాదిని చూస్తున్నా ననుకున్నాను * * * కొంతసేపటికి ఆ శిశువు నాలుగుమూలలా పరికించి నన్ను చూచి మందహాసము చేసినప్పుడు, నా వొడలు జలదరించింది. ఒకవింతఆనందము తోచింది. ఈ అపరిచితప్రపంచములో ఆ గదిలో నే నొక్కడనే ఆశిశువుకు పరిచితుడననిపించింది. ఎక్కడో, ఏలోకములోనో, ఎప్పుడో, ఆక్షణమునుంచే నాకు జన్మాంతరమందు, లోకాంతరములందు సంచరించే జీవుడొక్కడేనని, ఈశరీరము నిమిత్తమాత్రమని విశ్వాసము ఏర్పడ్డది. అప్పుడే మా శూన్యగృహమునూ, మాదంపతుల సంకప్తహృదయములను ఆనందపరచడానికి వచ్చిన దివ్యజ్యోతి ఈపిల్ల అని భావించుకున్నాను.

ఆపిల్లతండ్రికీ నాకూ మొట్టమొదట ఇంగ్లాండులో పరిచయము. నేను ఐ. యం. యస్. ప్యాసై, కొన్నాళ్లు ఉద్యోగములో ఉండి, Study leave పైన మళ్లీ ఇంగ్లండు వెళ్లాను. అప్పటికి నారాయణరావు I. C. S. చదువుతున్నాడు. చూచిన వేళావిశేషాన్ని బట్టి మాకిద్దరకూ గాఢమైన మైత్రి ఏర్పడ్డది. అతను బ్రతికివున్నన్నాళ్లూ నామాట

కెప్పుడూ ఎదురుచెప్పలేదు. తండ్రిమాటేనా అంతభయభక్తులతో పాటించాడో లేదో అనుమానమే. అతని పరీక్షా, నాచదువూ అయిపోయి, ఇద్దరమూ స్వదేశము ఒక్కసారే చేరుకున్నాము. తరువాత అతను వివాహము చేసుకున్నాడు. ఇంకో నాలుగు సంవత్సరములపిమ్మట మాపద్మావతి పుట్టింది. పురిటిముందు నారాయణరావుభార్యకు చాలాజబ్బు చేసింది. జీవించదని అంతా అనుకున్నారు. రెండు ప్రాణాలలోనూ ఒకటేనా దక్కదేమోననేస్థితిలో నన్ను రమ్మని ఉల్లిగ్రాం వచ్చింది. నాకూ పిల్లలు లేరు. నేను అప్పుడు మధురలో ఉండేవాడిని. అతను బరంపురంలో ఉండేవాడు. నేనూ, నాభార్యాకూడా పరుగెత్తాము. అక్కడ డాక్టరుతోటి మాట్లాడి, కేసు బ్రహ్మాండము మీద నాచేతులోకి తీసుకుని, నెలరోజులు యమునితో యుద్ధముచేసి నాస్నేహితుని భార్యను బ్రతికించాను. పురిటికికూడా నేనే దగ్గర ఉన్నాను.

౨

క్రమేణా తంటాలుపడి మేమిద్దరము ఒకఊళ్లోనే ఉండేఏర్పాటు చేయించుకొన్నాము. ఇందులో ఎవరికి మార్పుఅయినా రెండోవాళ్లుకూడా నానాతంటాలు పడి మార్పించుకునేవాళ్లము.

పద్మ ఎప్పుడూ మాఇంట్లోనే ఉండేది. దాని ఆటలూ, పాటలూ, ముద్దులూ, ముచ్చటలూ చెప్పనలవికాదు. అవి తలచుకుంటూనే ఈవ్యర్థజీవనము గడుపుకుంటున్నాను. ఈనా ఆఖరురోజులలో ఆస్మరణమే, ఆసంకీర్తనమే నాకు భగవన్నామస్మరణా, సంకీర్తనాను. మధుర, బృందావనము, యమునాతీరారణ్యములూ, గోకులము చూచినప్పుడు వైష్ణవ భక్తుల కెట్టిఆనందము కలుగుతుందో, నాతల్లి తిరిగినచోట్లూ,కూచున్న కుర్చీలూ అవీచూస్తే నాకూ అట్టిఆనందమే కలుగుతుంది. ఆమె వల్లనే నాలో ఉండే నాస్తికత పోయి ఆస్తికత ఏర్పడ్డది. ఆపిల్లతనుకాంతి చూస్తే తప్త కాంచనశబ్దముయొక్క భావము తెలుస్తుంది. ఆమె అర్ధనిమీలితనేత్రములు చూచినతరువాతనే పురాతనరాజపుత్రచిత్రరచనాసౌందర్యము అర్థమైనది. ఆమెపలుకులూ, నడకలూ చూచినపిమ్మటనే, 'శారికాకీరపంక్తికి చదువుచెప్పు, బర్హిసంఘములకు మురిపములు గరపు, మదమరాళంబులకు చూపు మందగతులు'—అనేపంక్తుల భావము పూర్తిగా ద్యోతకమైనది. నేపెంచిన పిల్లఅనే అభిమానముచేత అతిశయోక్తి చెపుతున్నాననుకోవద్దు. అన్నికాలములయందూ, అన్నిదేశములయందూ కవులకు గాయకులకూ శిల్పులకు చిత్రలేఖకులకూ స్వప్నములయందు, భావములయందు కనుపించుచున్న దివ్యసౌందర్యమూర్తియొక్క మూర్తి' నాపద్మ. ఇంక నేమి చెప్పగలను? నా తల్లికి పదిసంవత్సరములు పూర్తిగా నిండకుండానే, నారాయణరావు హఠాత్తుగా

ఇన్‌ఫ్లుయంజా వచ్చి చనిపోయాడు. దానితో మాకు వియోగము ఏర్పడ్డది. నారాయణరావుభార్య పిల్లలను తీసుకుని వాళ్లస్వగ్రామము చేరింది. పిల్లచదువుకోసమేనా నాదగ్గర ఉంచమన్నాను. 'అన్నయ్యా, నేను మట్టుకు ఇంకను ఏమి చూసుకొని బ్రతకను, అదికూడా కాస్త ఇంట్లో లేకపోతే! తక్కిన వాళ్లిద్దరు బొత్తుగా పసికూనలాయిరి ఎలా గడుస్తుంది' అని విచారించింది. నేను ఏమీ సమాధానము చెప్పలేక, స్తంభితకంఠంతో, పూరితనయనాలతో నాతల్లిని ముద్దాడి పంపించేశాను. తరువాత అప్పుడప్పుడు శలవులలో వస్తూవుండేది మా యింటికి. నెలా రెండు నెలలూ ఉండిపోతుండేది.

ఇట్లా రెండుసంవత్సరములు గడచినాయి. పద్మకు పండ్రెండవసంవత్సరము జరుగుతోంది. త్వరగా వివాహము చెయ్యమని అయినవాళ్లు, కానివాళ్లుకూడా తొందరచేశారు. తల్లి తనభర్త బాగుండగా రజస్వలానంతరవివాహాలు చాలామంచివనీ, అతిబాల్యవివాహాలు చాలా దూష్యములనీ అనేక ఉపన్యాసాలిచ్చింది. అనేకమందిచే తన అధికారబలిమిచేత, వాళ్లపిల్లలకు రజస్వలానంతరవివాహాలు చేయించింది. కాని స్వవిషయము వచ్చేసరికి నాకూతురుజోలి నీ కెందుకనలేకపోయింది, సలహాదార్లను. విద్యాధికులూ, బ్రాహ్మలూ చేసే దార్జన్యాలు వేరొకళ్లు చెయ్యలేరు చూశిచూశి. అన్నిటికీ మతమో, సంఘమో మనకు శరణు. ఆలోచిస్తేమట్టుకు మనిషియొక్క పిరికితనము తప్ప మఱొకటి కాదు. ఎక్కడో ఒక అగ్రహారీకుల పిల్లవాని కిచ్చి ఫలానప్పుడు వివాహమని నాకు శుభలేఖ వచ్చింది. అంతకు ముందు నాకేమీ కబురు లేదు. దానితో నిర్ఘాంతపోయి, తిరుగురైలులో వాళ్లఊరు చేరుకున్నాను.

నారాయణరావుకు ఏకోదరులు ఎవ్వరూ లేరుగాని ఒకవేలువిడిచిన అప్పగారు ఒకామె ఉండేది. చాలా తక్కువస్థితిలో ఉండేవాళ్లు పాపం. ఇతను చాలాసహాయంగా ఉండేవాడు. ఆమెకు ముగ్గురు కొడుకులు. సుందరం కడసారం. ఈపిల్లవాని మూడోయేట, తండ్రి, కృష్ణలో స్నానం చేస్తుండగా ఆనకట్టు తలుపు మీద పడి పోయాడు. ఆవార్త విని తల్లి ఆత్మహత్య చేసుకుంది. పెద్దకుర్రవాళ్లిద్దరూ కాస్త జ్ఞానంవచ్చినవాళ్లు. వాళ్లకేదో తగుసహాయంచేసి సుందరాన్ని మట్టుకు తనదగ్గర పెట్టుకుని కొడుకుకంటె ఎక్కువగా పెంచాడు.

సుందరం నిజంగా సుందరమూర్తే. సౌందర్యానికి తగ్గ సుగుణసంపత్తి, ఉదారభావములు, మహదాశయములు. ఏ జమీందారీకుటుంబములోనో పుట్టవలసినవాడు కాని నిరుపేదబ్రాహ్మణ కుటుంబములో పుట్టవలసినవాడు కాడు. కవిత్వమూ, గానమూ అతనికి పుట్టుకతోటే వచ్చినాయి. అతను మాట్లాడుతుంటేనే ఏదోపాట పాడుతున్నట్లుగా ఉండేది. ఆ మార్దవమూ, మాధు

ర్యమూ, సౌకుమార్యమూ చెప్పనలవికాదు లెండి. ఏడాబామీదనో నిలబడి, ఏకోకిల పాటో వింటూనో, ఏ సూర్యోదయమో చూస్తూనో ఉంటే, అతని చెవులకు లోకాతీతమైన ధ్వనులు వినపడుతూ, కన్నులకు దివ్యదర్శనము లేవో అవుతూఉండే వనుకుంటాను. ఆసమయాల్లో అతన్ని చూస్తే మట్టుకు కుర్రవాడైనా, నిశ్చలసమాధిలోనున్న మహాయోగివలె నుండేవాడు. చూచి నమస్కరించ బుద్ధి అయేది. మా పద్మకు కూడా, వాని ధ్యానమే, వాని మాటలే, వాని భావములే, ఆకవిత్వమే, ఆగానమే అబ్బింది. విశేషించి నాతల్లికి చిత్రలేఖనము కూడా చక్కగా అబ్బింది. అతను నిద్రలో చూచి వర్ణించిన స్వప్నములనూ, అతని మనోవీథిలో పరుగెత్తే భావములనూ నా తల్లి చిత్రములలో బంధించేది. కొన్నిరోజుల వరకూ వాళ్లు ఆపటములు చూచి ఆనందించుకునేవారు. ఈ రహస్యానందము వాళ్లిద్దరిమధ్యనే. రెండోకంటివాళ్లకు తెలిసేది కాదు. వాళ్లు ఎప్పుడూ చెప్పేవారుకారు. చెపుతేమట్టుకు ఇవన్నీ ఎవరికిఅర్థమవుతాయి. ఇదంతా నాపద్మనన్ని అగాధములో ముంచి పోయిన కొంతకాలమువరకూ నాకూ తెలియ లేదు. కాని, బ్రహ్మ ఎక్కడేనా ఒకమొగవాని కోసము ఒకఆడదాన్ని సృష్టిచేసి ఉంచాడూ అంటే ఆపిల్లవాడికోసము ఈ పిల్లను పుట్టించాడు అనుకునేవాళ్లము. ఆటలలోనూ, పాటలలోనూ, మాటలలోనూ వాళ్లిద్దరూ ఒక్కటే. భేదమనేమాట ఎప్పుడూ లేదు. సృష్టిలో ఏ ఇద్దరూ ఇలా ఏకీభవించడము నేను కని విని ఎరుగను. మీరేమైనా ఎరుగుదురేమో నాకు తెలియదు. వాళ్లిద్దరి హృదయాలూ ఎప్పుడూ ఒక్కటిగానే స్పందిస్తూ ఉండే వనుకుంటాను. ఇద్దరి శ్వాసలూకూడా పరిశీలిస్తే ఒక్కమాదిరిగానే ఉండే వనుకుంటాను.

ఇంట్లోఉన్న ఇలాంటి పిల్లవాడిని వదలుకుని ముక్కూమొగమూ ఎరుగని పరాయి సంబంధముకోసము పాకులాడేవాళ్లు ఎక్కడేనా ఉంటారా? ముంజేతిమాణిక్యాన్ని వదలుకుని, మూలనున్న గులకరాతికోసం వెతుక్కోడంలో అర్థమేమైనా ఉన్నదా?

అనేకవిధాల ఆవిడతోటి చెప్పాను; వాదించాను. కోప్పడ్డాను. ఏమిచేస్తే ఏమి లాభము? ఆడవాళ్లకు, అందులో ధనవంతులైన వితంతువులకు, వాళ్లకు తోచినంతేకాని ఇంకొకళ్లు చెపుతే ఎందుకు వింటారు. ఎంత పు చెప్పినా ఆవిడది ఒక్కటే పాట. "ఈపిల్లవాడికి ఏమీలేదు. రెక్కలమీద ఆధారపడవలసిందేను! అవతలవాళ్లకు బోలెడంత ఉంది. నాపిల్లకూ, పిల్లపిల్లలకూ ఏమీ లోటు ఉండదు." ఇదితప్ప వేరుమాట లేదు. ఏమిటి దానికి సమాధానము? డబ్బు ఎంతపని చేస్తోందో చూశారా! డబ్బు పాపహేతువనీ, దానివలన వచ్చే సౌఖ్యములన్నీ నిజంగా దుఃఖ

దాయకములనీ చెప్పగలిగిన వేదాంతమునకు పుట్టినిల్లయిన మనదేశములో, ధనసమార్జనయందాసక్తి లేకుండా, యాచన చేసుకుంటూ జీవయాత్ర గడపవలసిన బ్రాహ్మణకుటుంబములో పుట్టి, అరుంధతీ, అనసూయాదిమహాపతివ్రతలను ఆదర్శముగా పెట్టుకున్న విద్యావతియైన ఒకబ్రాహ్మణస్త్రీ, ఇతరులు ఆస్తివంతులని ఇంట్లో సంబంధము మానుకున్నదంటే ఎంతదారుణము, ఎంతసిగ్గు! బ్రాహ్మణులలో జరిగే ప్రతివివాహములోకూడా డబ్బుదగ్గర పేచీలేనిది ఒక్కటేనా ఉందా! వేలంపాట పెట్టి, పోటీలు పెట్టి, కోడళ్లను కొనుక్కుని, తరువాత వాళ్లను వేచుకుతినే ఈబ్రహ్మరాక్షసులేకాదూ మనకు సనాతనధర్మమార్గదర్శకులూ, ఉపదేష్టలూను.

పద్మను రహస్యంగా పిలిచి, ‘నువ్వు వప్పుకున్నావా అమ్మా’ అని అడిగాను. తలవంచుకొని, వినపడీ వినపడకుండా, ‘ఏమి చెయ్యగలను’ అంది. అని, ఒక్కక్షణము ఊరుకుని, నా మెడకు తన రెండుచేతులూ పెనవేసి ఒక్కమాటు కడుపు చెక్కలయేటట్లు రాగాలెట్టి, ‘మామా, నన్నెందుకు విడిచిపెట్టావు నువ్వు? మీ ఇంట్లోనన్ను ఉండనివ్వకపోయినావా? పంపనని మాఅమ్మతో దెబ్బలాడకపోయినావా? నీ కామాత్రము అధికారము లేదూ? నీకూ నామీద ఇంతదయ లేకపోనా! ఇంతకూ నిన్ననవలసినప నేముంది? పరమేశ్వరునికే నామీద కటాక్షము లేనప్పుడు నీకు లేకపోవడములో ఆశ్చర్యమేమున్నది?’ అని ఒక్కపరుగున అవతలకు పారిపోయింది. ఆఅన్నమాటలూ, ఆనిలబడ్డ వైఖరీ, ఆ కళ్లలో నిప్పులూ చూచి హడిలిపోయినాను. నేను చచ్చినతరువాత యమధర్మరాజేవన్నాప్రశ్నలువేస్తే ఎంతభయపడేవాడినో ఇప్పుడూ అంతభయపడ్డాను, నిజంగా. ఆప్రశ్నలు వేసింది దేవుడేకాని, ఆపిల్ల కాదనే ఇప్పటికీ నానమ్మకము. వాటి కేమిసమాధానమున్నది? దోషినే. ముమ్మాటికీ దోషినే. ఈ దోషమంతా తల్లిది కాదు, నాదే. నా మెడకు చుట్టిన చేతులు ఉరిత్రాళ్లయి నన్ను చంపినా బాగుండేది అనుకున్నాను. అలా ఎందుకు జరుగుతుంది. జీవచ్ఛవములా బ్రతికి ఈపాపఫలమంతా అనుభవించవద్దూ. నా పాపఫలము నేనుకాకపోతే ఇంకెవ్వరనుభవిస్తారు? ఈజన్మలో చేసినదాని కీజన్మలోనే అనుభవము కావడముకూడా మంచిదే! అందుకనే అనుభవిస్తున్నాను.

నేను పిల్ల నెత్తుకుపోయి మాట్లాడకుండా సుందరాని కిచ్చి పెళ్లి చేద్దామా అనుకున్నాను. అలా చేసినా బాగుండేదేమో. కాని నాకు ధైర్యం చాలకపోయింది. నా కేమి అధికారమున్నది? ఆపిల్లపైన నాకున్న అవ్యాజానురాగము తప్ప మరేమీ లేదు. అందుచేత యీపని చేశానంటే కోర్టువారంగీకరించరు. చదువుకున్న సన్యాసి కున్నంత పిరికితనం మరెవ్వరికీ ఉండదనుకుంటాను.

ఆప్రయత్నము విరమించుకుని నాఉద్యోగానికి నేను పోయాను.

పెళ్లికి నేను వెళ్లలేదు. నాభార్యను మట్టుకు పంపించాను. మామూలు తగువులతోటీ, బిగువులతోటీ అయిదురోజులూ అలా అలా జరిగాయి.

*   *   *   *

3

యౌవనాంకురమైనతరువాత మాపద్మ సౌందర్యము వర్ణించడానికి నాబోటివానికి సాధ్యముకాదు. ఆమె ఎదుటనిలబడితే పెద్ద మెరుపుమెరుస్తే కన్ను చెదిరిపోయినట్లుండేది. ఎవరైనాసరే ఆపిల్లఎదుట నిశ్చేష్టులై శిలావిగ్రహాల్లా అలా నిలబడిపోవలసినదే. ఆసౌందర్యానికితగ్గ సుగుణసంపత్తి,వినయవిధేయత, విద్యాభిమానము, సంస్కృతాంధ్రములందొకపాటి పాండిత్యము, జన్మాంతరసముపార్జితమైన గానకళ, చిత్రలేఖనానైపుణ్యము-అబ్బా-ఇటువంటిపిల్ల సృష్టిలో ఇంకొకతె ఎక్కడేనా ఉన్నదండి!

భర్త అయిదవఫారము మూడేళ్లుతప్పి అంతటితో చదువు చాలించి ఇంటిదగ్గర కూచున్నాడు. చూడడానికి ఒకమోస్తరుగా బాగానే ఉంటాడు. కాని అంతే. మరేవిశేషము చూతామన్నా కంచుకాగడావేసి వెతకినా కనుపించదు. మామూలు అగ్రహారీకపు లక్షణాలన్నీ ఇతనిలోనూ మూర్తీభవించినాయి. తంత్రగొట్టుతనం, ఇతరులను చూస్తే అసహనం, విపరీతమైన అహంభావము, ధనపరభామినీవాంఛ, కొంచెము జూదము-ఇంక నాసుగుణసంపత్తి ఎరుగనివారెవరు? నిత్యము మనకళ్లఎదుట, కోర్టులోను, ఆసుపత్రులలోను ఈజాతివారు ప్రత్యక్షమౌతూనే ఉంటారు. వారివైఖరి చూడగానే అగ్రహారీకుడురా అని మూడుపంక్తులాముఖాన్ని వ్రాసిఉంటుంది.

ఇందులో ఏ అంశములోనూ పద్మమొగుడు ఇంకొకళ్లకు తీసిపోడు. విశేషము మాట్లాడుతే పేచీ ఒకటి. పిల్లను పుట్టింటికి పంపడానికి పేచీ. తీసుకురావడానికి పేచీ. దగ్గరున్నప్పుడు ఇంక చిత్రవధే. వివరముగా వర్ణించడ మెందుకు? డబ్బున్నదనుకొని అగ్రహారీకులకు పిల్లనిచ్చుకున్న ప్రతితండ్రికి ఈఅనుభవము తెలిసినదే. తేడా ఏమీ లేదు. అతిశయోక్తి అంతకంటే లేదు. ఒకసారి పండుగలకు వచ్చినప్పుడు నేను చూడ్డానికి వెళ్లాను. నాతల్లిని ఆనవాలుకట్టలేకపోయాను. అంత, అలా మారిపోయింది. ముఖంలో ఎప్పుడూ తాండవిస్తూఉండే మందహాసముగాని, కళాకాంతులుగాని ఎక్కడా లేవు. భోజనందగ్గరైనా ఎప్పుడూ పుస్తకం విడువనిది పుస్తకమన్నమాట ముట్టుకోడము మానేశింది. సంగీతమూ, చిత్రలేఖనమూ సంగతి చెప్పనే అక్కరలేదు. పిల్ల చూస్తే సగమైపోయింది.

ఒకరోజు సాయంకాలము దగ్గర కూర్చోపెట్టుకొని, ఆమాటా ఈమాటా చెప్పి, 'ఏమమ్మా, ఇలా అయిపోయినావు? ఓ చదువులేదు, సంగీతము లేదు, మాట లేదు, మంతి లేదు. ఏమీ లేదు. ఏమిటి కారణము తల్లీ, నాతోటి చెప్పవూ' అన్నాను. ఒక్కక్షణం అట్లే ఆకాశంకేశి చూస్తూ ఊరుకుంది. అశ్రువులతో నిండిన తన రెండు కళ్ళూ నక్షత్రకాంతిని ప్రతిఫలిస్తున్నాయి. 'ఏముంది మామా చెప్పడానికి? అగ్రహారపు కోడళ్ల అవస్థలు నీకు తెలియవు గనుకనా! అనుక్షణం అన్నిటికీ రంపపుకోతే. కూచుంటే తప్పు, నుంచుంటే తప్పు. శుభ్రమైన బట్ట కట్టుకుంటే తప్పు. కొత్త వస్తువు పెట్టుకుంటే తప్పు. ఇం కెలా బ్రతకడము? ఆమహారాజుకు ఏమీ అక్కర్లేదు. ఎక్కడెక్కడికో తిరిగి ఏ రెండో జాము వేళో, మూడో జాములోనో వస్తారు. ఆయన కేమి, మగవాడు. నోరెత్తడానికి వీలులేదు. పగలెప్పుడేనా ఇంటిదగ్గరుంటే నన్నూ నాతల్లినీ దూషించడముతో సరిపోతుంది. ఇంక నాకు చదువెందుకు, సంగీత మెందుకు? ఎవరు చూచి ఆనందించను? ఆ ఇంట్లో ఎవ్వరికీ లేనప్పుడు నాకుమట్టుకు దానివల్ల కలిగే ఆనంద మేముంటుంది? ఇక్కడంటే సుందరం బావ'–అని యింక మాట్లాడలేకపోయింది. ప్రతిఅక్షరమూ దాని హృదయములో నుంచి చీల్చుకొచ్చింది. ఆహా! ఆపిల్ల ఎంత బాధ పడుతున్నది. అన్నికష్టాలు ఈ పిల్లకే రావలెనా? అన్నీ చూస్తూరా యిలా ఊరుకోవలసినదేనా అని చాలా విచారించాను. ఏమి చెయ్యగలను?

౪

మాపద్మకి పదహారేళ్లు పూర్తిగా నిండలేదు. నేను వేలూరులో ఉన్నాను. హఠాత్తుగా ఒకనాడు సాయంకాలము పద్మకు ప్రాణంమీది కొచ్చినదనీ, నాకోసము బెంగపెట్టుకున్నదనీ, వెంటనే రమ్మనీ, పిడుగువలె టెల్లిగ్రాము వచ్చింది. జబ్బుగా ఉన్నట్లు ఉత్తరమేనా లేదు. ఏమిరా భగవంతుడా అని నేనూ, నాభార్యాకూడా వెంటనే బయలుదేరి వెళ్లాము. పిల్ల ఆసుపత్రిలో ఉందన్నారు. వెంటనే అక్కడికి వెళ్లాము.

పిల్ల శల్యావశిష్టముగా ఉన్నది. ప్రాణమంతా కళ్ల లో ఉంది. సంనికూడా ప్రవేశించింది. కళ్లు రెండూ జ్యోతుల్లా ప్రకాశిస్తున్నాయి. మొదట నన్ను గుర్తించలేదు. చూపు ఈలోకముమీద లేదు. నాడు పుట్టిన రోజున చూచినట్లుగానే నూతనప్రపంచాన్ని పరీక్షచేస్తున్నట్లుగా గది నాలుగుమూలలా చూస్తూ నాకేశి చూచి ఒక్కసారి దృష్టి నామీద నిలిపింది. నన్ను గుర్తించుకుంది. ముఖంలోకి ఎక్కడలేని ఆనందము వచ్చింది. నన్ను దగ్గర కూర్చో మని సంజ్ఞ చేసింది. కూర్చున్నాను. ఒకచేతితో నా చెయ్యి పట్టుకుని రెండవచేతితో నాముఖమంతా తడుముతూ 'అమ్మయ్యా, వచ్చావు మామా,

ఇంక నాకు ఫరవాలేదన్నమాటే. ఇంక నే బతుకుతాను కాదు మామా. నన్ను బ్రతికిస్తావుకాదూ. ఇన్నాళ్లనుంచి ఎందుకు రాలేదయ్యా! ప్రాణం పోతూంటేకూడా కాస్త చూచిపోకూడదా ' అంది.

బల్లిలా మంచాన్ని అంటిపెట్టుకున్న ఆ ఆకారము, గర్భనిర్భేదమైన ఆమాటలూ చూచి, వినేసరికి నాకడుపు తర్కుపోయింది. ఎక్కడలేని దుఃఖమూ వచ్చింది. నాజన్మలో మొదటిసారి బొరుమని చిన్నపిల్లవానికిమల్లే ఏడ్చాను. నాతల్లికళ్లుకూడా నిండినాయి. అయినా తనదుఃఖాన్ని ఆపుకొని పెద్దదానికిమల్లే నన్నూరడించడము మొదలుపెట్టింది

........................................

వెంటనే వెళ్లి అక్కడ దొరసానితో మా తల్లిసంగతి మాట్లాడినాను. ఏమిటి జబ్బు అన్నాను. మీరు మందేమిస్తున్నారు? ఇంతవరకూ ఎందుకు ముదరనిచ్చారు? అని గుక్క తిరగకుండా వందప్రశ్నలు వేశాను. ఇన్నిప్రశ్నలు వినగానే ఆమెకు కొంత కోపము వచ్చినది కాని నేను ఫలానా అని చెప్పగానే, నాతో సావధానముగా మాట్లాడింది. మాట్లాడడాని కేమున్నది? "వ్యాధి ఏమో తెలియదు. కారణ మంతకంటే తెలియదు. ఏ పరీక్షకూ, ఏమందుకూ లొంగలేదు. మే మేమీ లోటుచెయ్యలేదు. పిల్ల ఇంకొక్కరోజుకంటె జీవించదు. కాని ఆలోచించగా నా కొక్కటి తోస్తోంది. పిల్లజబ్బు శరీరసంబంధమైనది కాదు. మానసిక మని తోస్తుంది. దుర్భరమైన మనోవ్యధ ఏదో ఈపిల్లని కుంగదీసి, గుండె పాడుచేసి, ఒకవిధమైన క్షయవ్యాధిలోకి దింపింది. ఇంత చిన్నపిల్ల కంత మనోవ్యధ ఉండడానికి తగ్గ కారణము కనుపించదు. తల్లినడుగుతే అటువంటి దేమీ లేదంది ఆమె. అయినా మీరుకూడా యోచించండి" అన్నది దొరసాని. యోచన కేమున్నది? దొరసాని ఊహించినదే వాస్తవము. పిల్లశరీరములో జబ్బేమీ లేదు. ఏవిధమైన దోషమూ లేదు. నవవికసితపుష్పములో మాలిన్య మేముంటుంది? ఆమెవ్యాధి మానసికము. కన్నతల్లికూడా కనిపెట్టలేకపోయింది.

తనకు అవసానము సమీపించినదని పద్మకూడా తెలుసుకున్నది. మధ్యాహ్నము నన్ను దగ్గర కూర్చోపెట్టుకుని, పూసగుచ్చినట్లంతా చెప్పింది. వాళ్లు తన్ని పెట్టిన బాధలు, అన్న మాటలు, చేసిన అవమానములు ఆఖరుకు భర్తకూడా అనుక్షణమూ అవమానించుటే. దానితో ఆపిల్ల గుండె బద్దలై బెంగపెట్టుకుని మంచముపట్టింది. ఇదంతా ప్రపంచాని కేమి తెలుస్తుంది? ప్రపంచము దాకా ఎందుకు? కన్నతల్లికి తెలిసి ఏడిసినది కనుకనా! మాటలు ప్రాణాలుతీస్తాయా అంటారు. అనుభవించేవాళ్లకుకాని తెలియదు. కత్తితో పొడుస్తే నాలుగురోజుల్లో పుండు మానుకొస్తుంది. మాటతోపొడుస్తేఆజన్మాంతమదిబాధిస్తోనే ఉంటుంది. పైగా పద్మ మామూలుపిల్ల కాదు. అతిసున్నితమైన మనస్సు

దానిది. ఈలోకపు పిల్ల కాదది. ఆ అతిలోక సౌందర్యముతోపాటు దాని గుణములన్నీ కూడా లోకాతీతములే. దానిఆటలు, పాటలు, భావములు, ఆదర్శములు, ఆనందములు-అన్నీ లోకాతీతములే. అదెవ్వరూ కనిపెట్టలేకపోయారు. శరత్కాలములో సాయంసంధ్యయందు ఆకాశమున చిత్రితమైన రంగులు చూస్తే కొన్నిరోజులవరకూ దానికి తిండికూడా అక్కరలేకపోయేది. ఒక చక్కని పువ్వు చూస్తే చాలు, ఒకమంచిమాట వింటే చాలు, ఒక ఇంపైనమూర్తి చూస్తేచాలు, ఒళ్లు మరచిపోయేది. ఈలోకంలో పడి మానవాకృతి దాల్చి ఈమురికిలో తిరుగుతున్నా, ఈమాలిన్య మేమీ దాని కంటలేదు. దాని ఊహాలూ, చూపులూ ఏలోకములోనో సంచరిస్తూఉండేవి. మన అందరివలె జన్మాంతరవాసనలను పూర్తిగా వదలలేకపోయింది ఆపిల్ల. ప్రయాణమధ్యమం దాజీవుడిక్కడ ఒక్కక్షణం విశ్రమించాడన్నమాటేకాని దృష్టిఅంతా ముందుప్రయాణము మీదనే ఉండిపోయింది. శరీరసౌఖ్యములనేవి శాశ్వతములు కావనీ, బ్రహ్మానందమే శాశ్వతమనీ, అది కేవలము జ్ఞానలబ్ధమనీ మనకు ప్రతిమునసలమ్మా చెపుతుంది. కాని ఎవరేనా శరీరసౌఖ్యము వదలుకొని, ఎప్పుడు మానసికానందమే అనుభవిస్తున్నవాళ్లను చూచి మనము అర్థముచేసుకోలేముసరిగదా పిచ్చముండవాళ్లని, విశాఖపట్నమో, మద్రాసో పంపేపర్పాటు చేస్తాము.

పద్మకు పెళ్లిచెయ్యక తప్పదనుకున్ననాడు సుందరానికిచ్చిచేస్తే తీరిపోయేది. లేదూ, పెళ్లీ వద్దు, పెటాకులూ వద్దు, మాట్లాడక ఊరుకుని దాని పుస్తకాలతో, దాని సంగీతంతో దాన్ని విడిచినాబాగుండేది. ఏదీ లేకుండా, తెలిసో తెలియకో, తల్లి చేతులారా పిల్లను హంతకుల చేతుల్లో పెట్టింది. వాళ్లు నిర్భయంగా మూడుసంవత్సరములలో పిల్లను వధించారు. ఇది కోర్టులో రుజువుకాకపోవచ్చుకాని, ముమ్మాటికీ ఇది హత్యకాని వేరొకటి కాదు. 'నేను ఆయనతో ఏశరీరసౌఖ్యమూ కోరలేదు! మామా, దైవసాక్షిగా నాకక్కరలేదుకూడాను. నాభావనాప్రపంచములో నన్నెందుకు తిరగనివ్వకూడదు మామా! దానివల్ల వాళ్ల కేమి లోటు?' అన్నది నాతల్లి.

చిన్నపిల్లలు వాళ్ల కేమి తెలుసునను కుంటాము. వాళ్ల కేమి తెలుసునో తెలుసుకునే తల్లిదండ్రులెంతమంది ఉన్నారు, మనవాళ్లలో. ఆసాయంకాలమే అస్తమిస్తున్న సూర్యుడుతోపాటు నాతల్లికూడా అస్తమించింది. పద్మము ముకుళించుకుపోయింది. పళ్లెములో హారతికర్పూరములా హరించిపోయింది.

నా చేతులతో ఈ పాడులోకములో ప్రవేశపెట్టాను. ఈ పాడుచేతులతో పరలోకానికి సాగనంపాను.........

ఇంక నాఉద్యోగ మెందుకు తగలెయ్యను.

నాతల్లిని బ్రతికించలేని వైద్య మెందుకు, మానుకున్నా. అన్నీవదలుకున్నాను. నా తల్లే నాకు పరమేశ్వరునియందు భక్తి కుదు ర్చింది. ఆయనపాదములనే నమ్ముకున్నాను, ఎప్పటికైనా నాతల్లిదగ్గరకు తీసుకుపోడా అని.

పగలంతా నాతల్లి కడసారిపలుకులు చెవులలో గంటలుకొట్టినట్లు మోగుతూ ఉంటాయి. రాత్రంతా శ్మశానజ్వాలలో నా తల్లి మొగము ... శివశివా ...

---

# భావసంకీర్తనము

బాలాంత్రపు వేంకటరావు

౧

శోధించినకొలంది సొంపు పెంపగుచున్న
 దియుఁ, దలఁచిన కొలఁదిని దగులుమి
గులుచున్న దియు, వాడుకొనుకొలఁదిని వన్నె
 కెక్కు-చున్న దియు, గ్రహించినకొలఁ
దినికలకలఁ గళదేఱుచున్న దియుఁ, గ
 దలిచినకొలఁదిని గలుపువలపుఁ
దెలుపుచున్న దియును, నిలిపినకొలఁదిని
 నిండుచందురుఁబోలు నిగ్గుజగ్గు
తో వెలయుచున్న దియునగు నావిశుద్ధ
భావసుమము, నాజీవసంజీవసుమము,
మీఁదఁ గట్టియుంటిని నీవినోదమునకు
ఎపు డనుగ్రహించెదవో? నీయిష్టము ప్రభు!—

౨

ప్రారబ్ధమగు నాసుమాపణమ్మున, వాస
 నాకుసుమమ్ము లనేకములుగ
నమ్మివైచితిని. చిత్రమ్ములును, వివిధ
 కర్మదోహదములఁ గౌతుకములు
నైనపుష్పమ్ముల నమ్మివైచితిని. సం
 చితములును, రసశోభితములు నగు
మృదులతాంతముల సమ్మదమున నమ్మివై
 చితిని. సరమ్ములుఁ, జిత్రకంచు
కములు, నంగీలు, నుష్ణీషకములుఁ జెల్లె;
ఒకపవిత్రహృదబ్జమే యున్న దింక;
విలువకొనుమయ్య! దీని నావెలయొసంగి,
వేగ నాయంగడిని నెత్తివేయుదుఁ బ్రభు!—

3

ఈదీనదాసునిపైదయగల్గెనే!
 వచ్చితే! దర్శనమిచ్చితె! ప్రభు!
ఆనందబాష్పపాద్యము స్వీకరింపుము!
 నామనఃకమలాసనమ్మున నుప
విష్టుఁడవగుము! విశిష్టభక్తిరసప్ర
 పూర్ణవాక్సుమములఁ బూజఁగొనుము!
నాపుణ్యఫలముల నైవేద్యము గ్రహింపు;
 మంతరంగ శుభనిశాంతమందు,
భావ సుమశయ్యనలవోక పవ్వళింపు;
మాత్మవల్లకీప్రణవనాదామృతము ప్రి
యంబొ? జీవరాగప్రణయామృతము ప్రి
యంబొ? సెలవిమ్ము! నా సేవలందుము ప్రభు!—

---